


షటిల్‌లో సత్తాచాటారు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల జరిగిన జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విసిబిఎ క్రీడాకారులు అన్ని విభాగాల్లో ప్రతిభ చూపారని కోచ్ జి.శ్రీనివాసరావు తెలిపారు. అండర్-11 విభాగంలో జి.నవనీత్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. బాలికల విభాగంలో ఎస్.లాస్యశ్రీ సింగిల్స్, డబుల్స్ ప్రథమ స్థానాన్ని, అండర్-13 డబల్స్‌ల్లో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. బి.లాస్య అండర్-11, 13 విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచింది. కె.జశ్విత, హెచ్.శ్రీలలిత అండర్-11లో డబుల్స్‌లో ద్వితీయ స్థానం పొందారు. అండర్-13లో ఎస్.లిఖిత్ డబుల్స్ లో ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. అండర్-15లో చెల్లూరి మేఘవర్ష సింగిల్స్, డబుల్ విభాగాల్లో ద్వితీయ స్థానం పొందాడు. లోకేష్ డబుల్స్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. వీరిని బిసిబిఎ అధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్ , సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎంకెబి శ్రీను, కార్యదర్శి ఎన్.సురేష్ అభినందించారు.

మున్సిపల్ అధికారులు తొలగించిన పునాదులను మళ్లీ కట్టిన అక్రమార్కులు



బొబ్బిలి మున్సిపాలిటీలో పేదల కోసం ఏర్పాటుచేసిన ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలు తయారు చేసి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, పునాదులు నిర్మిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఉదాసీనతగా ఉండడంతో అక్రమార్కుల దందా అడ్డూ అదుపూ లేకుండా సాగిపోతోంది. నకిలీ పట్టాల తయారీలో పంచాయతీ విఆర్ఓ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నకిలీ పట్టాలతో గుటకాయస్వాహా

- ఇందిరమ్మ కాలనీలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ఫేక్ పట్టాలతో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న అధికార పార్టీ నేతలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న అధికార పార్టీకి చెందిన చోటా నాయకుల కన్ను అదే కాలనీలోని ఖాళీ స్థలాలపై పడింది. ఇదే అదునుగా భావించిన ఒక చోటా నాయకుడు పంచాయతీ విఆర్ఓ సహకారంతో నకిలీ పట్టాలు తయారు చేసి, అధికార పార్టీ నేతల అండదండలతో ప్రభుత్వ స్థలంలో పునాదులు వేశారు. నకిలీ పట్టాలతో ఆయా పునాదులను రూ.3 లక్షల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై అదే కాలనీలో నివాసముంటున్న మరో గ్రూపు చోటా నాయకులు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు జెసిబితో పునాదులను తొలగించారు. కొన్ని నెలల తర్వాత రెండు గ్రూపులు ఒక్కటవ్వడంతో మున్సిపల్ అధికారులు తొలగించిన పునాదులను మళ్లీ నిర్మించేశారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా

ఇందిరమ్మ కాలనీలో ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. కాలనీలో రెండు లేఅవుట్లు వేశారు. మొదట లేఅవుట్లో 1723 ప్లాట్లు, రెండో లేఅవుట్లో 625 ప్లాట్లు ఉన్నాయి. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పట్టణ పేదల కోసం ఇందిరమ్మ కాలనీ పేరుతో లేఅవుట్లు వేశారు. ఇందిరమ్మ మొదటి విడత, రెండో విడతలో 20 వార్డుల్లో ఎంపిక చేసిన 2,150 మందికి పైగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. వీటిలో 110 మంది పూర్తిగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోవడంతో పట్టాలు రద్దు చేయాలని అప్పటి హౌసింగ్ అధికారులు రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. ఇందిరమ్మ కాలనీలో రెండు లేఅవుట్లలో 2,348 ప్లాట్లు వేయగా, మరో 150 ఇళ్ల స్థలాలకు సరిపడిన స్థలాన్ని అప్పటి రెవెన్యూ అధికారులు ఖాళీగా ఉంచేశారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీగా ఉన్న స్థలంలో లేఅవుట్లు వేసి నచ్చిన వారికి పంచుకున్నారు. ఇందిరమ్మ రెండు విడతలలో పేదలకు ఇచ్చిన ఇళ్లల్లో 110 మంది పూర్తిగా పనులు ప్రారంభించకపోవడంతో రద్దు చేసేందుకు ప్రయత్నాలు చేశారు. ఆయా స్థలాలను కొంతమంది కబ్జా చేసి అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు లేఅవుట్లలో పేదలకు ఇవ్వకుండా 180కు పైగా ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయి. వాటికి నకిలీ పట్టాలు సృష్టించి అక్రమార్కులు అమ్ముకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

అధికార పార్టీ నేతల దన్ను

ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు ఆక్రమణ, నకిలీ పట్టాలు తయారీకి అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం. నకిలీ పట్టాలతో అమ్ముకుంటున్న స్థలాల వల్ల వచ్చిన సొమ్మును ఇందిరమ్మ కాలనీ చోటా నాయకులు, అధికార పార్టీ నేతలు పంచుకుంటున్నారని స్థానికంగా చర్చ సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాధ్యత రెవెన్యూ అధికారులదే

ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. నకిలీ పట్టాలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై దర్యాప్తు చేసి గుర్తించి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు లేఖ రాస్తామని చెప్పారు. ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ స్థలాలు అక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



శృంగవరపుకోట.. ప్రచారం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు, కార్మికులు

సామాజిక న్యాయానికి మోడీ తూట్లు

సమరభేరిలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని ● విజయనగరంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట, వేపాడ

సామాజిక న్యాయానికి ప్రధాని మోడీ తూట్లు పొడుస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. ముస్లిములపై, క్రిస్టియన్లపై బిజెపి, ఆర్ఎస్ఎస్ మూకలు అతికిరాతకంగా హింసకు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన సమరభేరిని బుధవారం వేపాడ మండలంలోని బొద్దాం, శృంగవరపుకోట మండలంలోని వెంకటరమణపేటలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ మణిపూర్, హర్యానాలో బిజెపి, ఆర్ఎస్ఎస్ మూకలు అది కిరాతకంగా దాడులు చేయడం, చంపడం దేశానికే అభద్రతని తెలిపారు. లౌకికరాజ్యంలో మత సమస్యకు తావు లేకుండా చూడాల్సిన ప్రధాని మోడీ.. వాటికి మరింత ఆజ్యం పోసేలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎన్నికల్లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని మోడీ హామీ ఏమైందని ప్రశ్నించారు. అధిక ధరలను నియంత్రించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. వీటన్నింటినీ పక్కదోవ పట్టించి, ఎన్నికల్లో లబ్ధి కోసం మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో మోడీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బొద్దాంలో నివశిస్తున్న ముస్లిములకు కనీస సౌకర్యాలు లేవని, 50 ఏళ్లుగా పూరిగుడిసెల్లోనే నివాసం ఉంటున్నారని తెలిపారు. వారికి పట్టాల కోసం పోరాటం చేస్తే పట్టాలిచ్చి, స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. వెంటనే స్థలాలివ్వాలని అధికారులను డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ, చలుమూరి శ్యామ్, వై.భాస్కరరావు, బి.శంకరరావు, ఎస్.రామసత్యం, షేక్ అబ్దుల్లా, షేక్ బుడ, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

విజయనగరంటౌన్ : సిపిఎం చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం కోట జంక్షన్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30, 31న సంతకాల సేకరణ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, సిఐటియు నాయకులు, శ్రీను, రాజు పాల్గొన్నారు. వైఎస్ఆర్ నగర్, తోటపాలెంలో, పూల్‌బాగ్‌లో సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.జగన్‌మోహన్, ఐద్వా నాయకులు వి.లక్ష్మి, వి.రామచంద్రరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విఆర్ఎలు, సిఐటియు నాయకులు

కలెక్టరేట్ వద్ద విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విఆర్ఎలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తే అక్రమంగా అరెస్టులు, నిర్బంధాలకు పాల్పడటం ముఖ్యమంత్రికి న్యాయమా? అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ ప్రశ్నించారు. విఆర్ఎల అరెస్టులకు నిరసనగా బుధవారం కలెక్టరేట్ వద్ద విఆర్ఎల సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. అనంతరం సురేష్, విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే విఆర్ఎల ఫైలుపైనే మొదటి సంతకం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. నాలుగేళ్లుగా మండల, జిల్లా కేంద్రాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు, పోరాటాలను నిర్వహిస్తున్నా ప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విఆర్ఎలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం దారుణమన్నారు. విఆర్ఎల సమస్య పరిష్కార బాధ్యతను ప్రభుత్వ ప్రధాన సలహాదారైన సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించారని, ఆయన మూడు అడుగులు ముందుకు, అరడుగుల వెనక్కి అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే ప్రభుత్వం విఆర్ఎల వేతనం రూ.26 వేలకు పెంచాలని, డిఎ, టిఎ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, రాజు, రాంబాబు, ఆదినారాయణ, రాముళ్లప్పడు, పైడి రాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా లక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా డిప్యూటీ లైబ్రేరియన్ బిలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి.. ఆమెకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ లలిత చేసిన అభివృద్ధిని కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ సంస్థను ముందుకు తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రాంభద్రరాజు, సీనియర్ అసిస్టెంట్ ఆచారి, సహాయ గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు 16 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సెప్టెంబర్ 2 నుంచి రాంచీలో జరిగే రెండో బిర్సా ముండా ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు విజయనగరం జిల్లా నుంచి 16 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు సిహెచ్ వేణుగోపాలరావు అభినందించారు.

వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటలు

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలో పంటల విధానాన్ని అమలు చేయాలని, పరిస్థితి చేయిదాటక ముందే ప్రత్యామ్నాయ చర్యలను తీసుకోవాలని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం కలెక్టరేట్ సమావేశం మందిరంలో బుధవారం జరిగింది. 2023-24 ఖరీఫ్ సీజన్‌కు పంటల విధానం, ఎరువులు, విత్తనాల సరఫరా, వర్షాభావ పరిస్థితులు, హమాలీ ఛార్జీల చెల్లింపు తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ నిర్వహించారు. సమావేశంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు నివేదిక చదివి వినిపించారు. ఇప్పటి వరకు అన్ని రకాల పంటలకు సంబంధించి 60 శాతం నాట్లు పూర్తయ్యాయని, జూన్, జూలైతో పోల్చితే 9.4 శాతం వర్షపాతం అధికంగా నమోదైందని వెల్లడించారు. ఆగస్టులో కొంచెం వర్షపాతం తక్కువగా ఉందని, సెప్టెంబర్‌లో అనుకూల వర్షాలు ఉండొచ్చని ప్రస్తావించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

అనంతరం జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు 1001, 1010 రకాలకు బదులుగా ఎన్ఎల్ఆర్ 34449 రకాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా అవసరాలకు సరిపడా సుమారు 10 వేల క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేయాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. గోదాముల్లో ప్రస్తుతమున్న 1.33 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని మరింత పెంచాలన్నారు. తోటపల్లి నుంచి వారం రోజుల్లోగా విజయనగరం బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఎలాంటి షరతులు లేకుండా కేంద్రం నిర్ణయించిన విధంగా టన్ను చెరకుకు రూ.3,150 చెల్లిస్తే లాభదాయకంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. సిసిఆర్‌సి కార్డులున్న కౌలురైతులకు కూడా రుణ సదుపాయం కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. అర్హతలు, నిబంధలను బట్టి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గేదెల వెంకటేశ్వర రావు, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.



రాఖీ కడుతున్న విద్యార్థిని

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్

విజయనగరం టౌన్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను కోట జంక్షన్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కోట జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహించారు. పట్టణ పౌరులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ గర్ల్స్ కన్వీనర్ లావణ్య మాట్లాడుతూ నిర్భయ , దిశ వంటి చట్టాలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని కాగితాలకే పరిమితం చేసి, విద్యార్థినుల రక్షణ గాలికి వదిలేశాయని దుయ్యబట్టారు. ఇటువంటి పరిస్థితిలో తమ తోటి విద్యార్థులను కాపాడుకోవాల్సిన బాధ్యత సహచర విద్యార్థుల మీద పడుతోందన్నారు. కార్యక్రమంలో గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ సభ్యులు సమీరా, సంధ్య, ఎర్రమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, పి.రమేష్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై ఆరా

- ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడిన కలెక్టర్
- డెంకాడ మండలంలో విస్తృత పర్యటన
- పలు ప్రభుత్వ కార్యక్రమాలు తనిఖీ

ప్రజాశక్తి-డెంకాడ

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ప్రత్యేక దృష్టిసారించారు. ఈ ప్రక్రియను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డెంకాడ మండల కేంద్రంలో స్వయంగా ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఆరా తీశారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులకు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. ఓటర్లతో మాట్లాడి, వారు అందజేసిన దరఖాస్తులను నిర్ధారించారు. ఇంటింటి సర్వే వివరాలను తెలుసుకున్నారు.

సచివాలయం తనిఖీ

ముందుగా పినతాడివాడ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. బడి ఈడు వయసు వారంతా తప్పనిసరిగా బడుల్లో ఉండాలని ఆదేశించారు. పాఠశాలల్లో శతశాతం చేరికలు జరగాలని స్పష్టం చేశారు. వలస వెళ్లిన వారు కూడా ఎక్కడో ఒక చోట బడిలో చేరిందీ, లేనిదీ ఆరా తీయాలని సూచించారు. ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు, క్లాప్‌మిత్రలకు జీతాల చెల్లింపు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్, పిఎం కిసాన్ పోర్టల్లో నమోదు, మధ్యాహ్న భోజన పథకం, రక్తహీనత కేసులు, తదితర అంశాలపై ఆరా తీశారు.

సర్వే ప్రక్రియ పరిశీలన

జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద పినతాడివాడ గ్రామంలో చేపట్టిన స్వామిత్వ సర్వేని కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఇంతవరకు జరిగిన సర్వే ప్రక్రియపై ఆరాతీశారు. రోవర్ పనితీరు, రాళ్ల పాతే ప్రక్రియను పరిశీలించారు. సర్వే వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఆరోగ్య పరిరక్షణపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. గొడ్డుపాలెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలో వ్యాధిగ్రస్తులు, వారికి ఇస్తున్న మందులపై ఆరాతీశారు. డయేరియా కేసులు ఎక్కువగా ఉన్నాయని తెలుసుకొని, రక్షిత తాగునీటి సరఫరాపై ప్రశ్నించారు.



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రాధాన్యత భవనాలను పూర్తి చేయాలి

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గుణుపూరుపేటలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను కలెక్టర్ పరిశీలించారు. మిగిలి ఉన్న పనులను వారంలో పూర్తిచేసి, వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పర్యటనలో జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, డిఎల్‌డిఒ లక్ష్మణ్, తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపిడిఒ స్వరూపరాణి, తదితరులు పాల్గొన్నారు.

గొడ్డుపాలెం గ్రామానికి డెంకాడలో సేవలు

గతంలో ఉన్న మాదిరిగానే గొడ్డుపాలెం గ్రామానికి డెంకాడ పిహెచ్‌సిలో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మోపాడ పిహెచ్‌సిలో వైద్య సేవలు వద్దని డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించాలని గొడ్డుపాలెం గ్రామానికి చెందిన ప్రజలు కోరినట్లు ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనాన్ని గ్రామ సర్పంచ్ కలిశెట్టి రామకృష్ణ, ఎంపిటిసి విజినగిరి అచ్చంనాయుడు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంటనే స్పందించి మ్యాపింగ్ సెక్షన్ పరిశీలించి బంగారు రాజుపేటను మోపాడ ఆరోగ్య కేంద్రంలోనూ, గొడ్డుపాలెం గ్రామాన్ని డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మార్పు చేయాలని ఆదేశించారు.

'సీతం'లో సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో 'ఇనిషియేటింగ్ స్టార్టప్ అండ్ బిల్డింగ్ ఇట్స్ వాల్యూ' పేరుతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. సీతం ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ అంకుర పరిశ్రమ వీహాన్ ఎలక్ట్రిక్ అండ్ టెక్ టీమ్ సొల్యూషన్స్ ఫౌండర్ అండ్ సిఇఒ నల్లమల్లి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్టప్ వ్యవస్థ ముఖ్య ఉద్దేశం వాటి ప్రాముఖ్యతను, లాభనష్టాలపై ముఖ్యంగా వివరించారు. ఎలక్ట్రిక్ వెహికల్స్ పరిశ్రమ రంగం ఎదుగుతున్న సమయంలో ప్రస్తుత టెక్నాలజీలు ఉపయోగిస్తూ అందుకు గాను చాలా అంకుర కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. రానున్న కాలంలో మరిన్ని కొత్త కంపెనీలు రావాల్సిన అవసరముందన్నారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు స్ఫూర్తిని పొందేవిధంగా సీతం కళాశాల యాజమాన్యం కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి, మెకానికల్ విభాగాధిపతి సిహెచ్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పూడికతీత పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

పూడికతీత పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని జొన్నగుడ్డి వద్ద పెద్దకాలువలో భారీగా పూడికలు పేరుకుపోయి, మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సంబంధిత సిబ్బందితో మాట్లాడి పనులు చేయించారు. బుధవారం మధ్యాహ్నం స్వయంగా పూడికతీత పనులను పరిశీలించారు. చెత్తాచెదారాలను తొలగించి మురుగునీరు సాఫీగా పోయేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఇప్పిలివీధి వద్ద రహదారిపై కుళాయి నీరు లీకేజీలు ఉండటాన్ని పరిశీలించి, వెంటనే నగరపాలక సంస్థ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. లీకేజీని అరికట్టేందుకు శాశ్వత పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఇ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

లలిత మరణం తీరనిలోటు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లలిత మరణం తీరనిలోటని జిల్లా చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో లలిత సంతాపసభను ఏర్పాటు చేశారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా లలిత అందించిన సేవలను కొనియాడారు. జిల్లా సంస్థను రాష్ట్రస్థాయిలోనే ఉన్నతంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారన్నారు. విజయనగరం జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బుద్ధరాజు రాంభద్రరాజు మాట్లాడుతూ లలిత మృతిపట్ల విచారం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



లలిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ పద్మావతి

ప్రజాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

లక్కవరపుకోట: ప్రజాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గంగుబూడి గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలనుద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, వేపాడ ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపిపిలు ఆవాల శ్యామల, ముదునూరి శ్రీనురాజు, ఇందుకూరి సుధారాజు, ఎఎంసి డైరెక్టర్లు యర్ర శ్రీనివాసరావు, కొట్యాడ శ్రీనివాసరావు, వైసిపి సీనియర్ నాయకులు కూరాకుల సూర్యారావుపాల్గొన్నారు.

డిజిటల్ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాలని నిరసన

కొత్తవలస: పిఆర్‌ఐఐఎం కార్డ్ 2.0 డిజిటల్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ కొత్తవలసలోని డాక్యుమెంటరీస్ రెండు రోజులు పెన్‌డౌన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. డిజిటల్ రిజిస్ట్రేషన్ పెట్టి తమ పొట్ట కొట్టవద్దని యథావిధంగా కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు లక్ష మంది వరకు డాక్యుమెంట్ రైటర్స్ మీదే ఆధారపడి జీవిస్తున్నామని అన్నారు. పరోక్షంగా మరో లక్ష మంది ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలిగొట్ల వెంకటేశ్వరరావు, ఓరుగంటి మురళీకృష్ణ, ఐతంశెట్టి శివప్రసాద్, చుక్క శ్రీనివాసరావు, పెదిరెడ్ల భానోజీరావు, పోలమరశెట్టి వెంకట అప్పారావు, బివిఎం పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

రామభద్రపురం: ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధ్య పడతాయని స్థానిక వ్యవసాయాధికారి వెంకటయ్య తెలిపారు. బుధవారం సిబ్బందితో కలిసి గొళ్ళలపేటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం పలు రకాల సాగు యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. వరి సాగుకు ముందు పచ్చి రొట్ట పైరు సాగు చేయడం వల్ల 25 శాతం నత్రజని ఆదాచేయడంతో పాటు తెగుళ్ళ నివారణకు ఉపకరిస్తుందని తెలిపారు. వరి పిలకల సమయంలో నీరు అందించే విధానం, మిత్ర పురుగుల నుంచి రక్షణ చర్యలు వివరించారు. సకాలంలో సస్య రక్షణ చర్యలు పాటిస్తే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధ్య పడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, విఎఎ లావణ్య పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొండ్రు పరామర్శ

వంగర: మండలంలోని అరసాడకు చెందిన చిన్ని గంగులు, తమ్మి వెంకునాయుడు, తమ్మి అక్కమ్మ, మద్దువలస గ్రామానికి చెందిన కావలి సంగమ్మ, సంగాం గ్రామానికి చెందిన కాకొటుల నీలం నాయుడు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజాం నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కొండ్రు మురళీమోహన్ బుధవారం ఆయా గ్రామాల్లో పర్యటించి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం మహిళా అధ్యక్షులు లచ్చుబుక్క ధనలక్ష్మి, వంగర మండల నాయకులు లచ్చుబుక్క కృష్ణమూర్తి, బెజ్జిపురం రవి, మజ్జి గణపతి తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణాల కిట్లు పంపిణీ


విద్యార్థులకు కిట్లను అందిస్తున్న ప్రతినిధులు

విజయనగరం: స్థానిక నగర పాలక కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యాశాఖ, సమగ్రశిక్షా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రజ్ఞా వైకల్యం విద్యార్థులకు బోధనోపకరణాల కిట్లను పంపిణీ చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి రోజు 114 మంది వికలాంగ విద్యార్థులు ఒక్కొక్కరికీ సుమారు 10వేల విలువ చేసే కిట్స్‌ను అందజేశారు. జాతీయ మేధో వైకల్య సాధికార సంస్థ, హైదరాబాద్ సౌజన్యంతో ఈ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు కె. ప్రవీణ్ కుమార్, టి. రాకేష్, జిల్లా సమగ్ర శిక్షా సహిత విద్య సమన్వయకర్త ఎస్. సూర్యారావు, సహ సమన్వయకర్త ఎం. భారతి, సహిత విద్య ఉపాధ్యాయులు, వివిధ మండలాలకు చెందిన వికలాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'గెడ్డలోకి వ్యర్థాలు వదిలేస్తే ఊరుకోం'


యాజమాన్య సిబ్బందితో మాట్లాడుతున్న మాధవి

పూసపాటిరేగ: నిబంధనలు అతిక్రమించి మండలంలోని కందివలస గెడ్డలోకి అరబిందో తదితర అనుసంధాన పరిశ్రమల వ్యర్థ జలాల పైపులైన్ల నిర్మాణం చేస్తే చూస్తూ ఊరుకోబోమని జనసేన నెల్లిమర్ల నియోజకవర్గం నాయకులు లోకం మాధవి హెచ్చరించారు. మండలంలోని కందివలస గెడ్డలో అరబిందో పరిశ్రమ అనుసంధాన పరిశ్రమ యొక్క వ్యర్థ జలాల పైపు లైన్ నిర్మాణం పనులను బుధవారం ఆమె అడ్డుకున్నారు. 2017లో న్యాయ స్థానం ఇచ్చిన నిబంధనలు ప్రకారం గెడ్డలో ఎటువంటి పైపులైన్ వేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పరిశ్రమపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఆమెతో పాటు లోకం ప్రసాద్, జనసేన నాయకులు, ఉన్నారు.

ట్రిపుల్ ఐటికి గోపిక ఎంపిక

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థిని బొలిరెడ్డి గోపిక ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం యన్ మాధవీలత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గత ఏప్రిల్ నెలలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 558 మార్కులతో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన తిమిడి గ్రామానికి గోపిక కడప జిల్లా ఇడుపుల పాయలో ట్రిపుల్ ఐటీకి ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గోపికి తల్లిదండ్రులు బొలిరెడ్డి అచ్చిం నాయుడు, అచ్చియమ్మలను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సులోచన, కళ్యాణి, నిర్మల, డివి సూర్యనారాయణ, గోపాలరావు, సూర్యప్రకాష్, వై వెంకటరావు, సుందరాడ అప్పారావు, పౌల్ సుధాకర్, టిఎఎన్ సత్యారావు తదితరులు అభినందించారు.

వరుణ్ మారుతితో ప్రభుత్వ ఐటిఐకి ఒప్పందం


ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న జెసి

విజయనగరం : ప్రభుత్వ ఐటిఐకి వరుణ్ మారుతితో డీజిల్ మెకానిక్ ట్రైనీల శిక్షణకి సంబంధించి ఒప్పందం కుదిరింది. జెసి మయూర్ అశోక్ సమక్షంలో ఈ ఒప్పందం చేసుకున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ టివి. గిరి తెలిపారు. ఈ ఒప్పందం వల్ల శిక్షణ కాలంలో ఉన్నపుడే 3 నెలలు కాలం వరుణ్‌లో ప్రత్యేక శిక్షణ పొందే అవకాశం కలుగుతుందన్నారు. వరుణ్ నుండి శిక్షకులు వచ్చి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు, ప్రాక్టికల్స్ కోసం పరికరాలను సమకూర్చేందుకు ఈ ఒప్పందం సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ జనరల్ మేనేజర్ (సర్వీసెస్) శ్రీనివాస్ రెడ్డి, ట్రైనింగ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జిల్లా మేనేజర్ కిరణ్, ట్రైనింగ్ ఆఫీసర్ రామాచారి పాల్గొన్నారు.

స్త్రీలను గౌరవించి సోదరభావాన్ని పెంపొందిద్దాం

శృంగవరపుకోట: స్త్రీలను గౌరవిద్దాం సోదర భావాన్ని పెంపొందిద్దామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చినబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని గిరిజన బాలికల కళాశాల వసతి గృహం విద్యార్థినిలు ఆయనకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ మహిళలపై నానాటికీ హింస పెరిగిపోతూనే ఉందని స్త్రీలపై హింసకు స్వస్తిపలికి వారిని అక్కచెల్లెల్లులా భావించాలని అందుకు రాఖీ పౌర్ణమి ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ రాఖీ పౌర్ణమిని చెల్లెమ్మల అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన కోరారు. అనంతరం కళాశాల వసతి గృహ విద్యార్థులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లోవరాజుకు విద్యార్థులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సమరభేరి

ప్రజాశక్తి- రేగిడి

ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఉణుకూరు గ్రామంలో సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ భారం, అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలపై సిపిఎం నాయకులు పోరెడ్డి విశ్వనాథం, ఎం. త్రినాధ్, కె. తిరుపతిరావు సంతకాలు సేకరించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. గద్దెనెక్కిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలిస్తూ పేద ప్రజలపై పన్నుల భారాలు మోపుతున్నారని ఆరోపించారు. వీటికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న సచివాలయం ముందు కరెంట్ బిల్లులను దగ్ధం చేసి ధరలు తగ్గించాలని ధర్నా, 3న నిరుద్యోగ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం, 4న తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాలను చేపడుతున్నామని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


బొబ్బిలి: సంతకాలను సేకరిస్తున్న సిపిఎం నాయకులు శంకరరావు, తదితరులు

లక్కవరపుకోట: మతోన్మాది నరేంద్రమోడీని అడుగడుగునా నిలదీయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం సంతకాల సేకరణ చేశారు. ప్రజా సమస్యలపై సెప్టెంబర్ 4 వరకు జరుగుతున్న నిరసన కార్యక్రమాలకి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కొత్తవలస: నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలని పెంచిన కరెంటు చార్జీలు ఉపసంహరించుకోవాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతూ సిపిఎం పార్టీ చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో కొత్తవలస సిమెంట్ రోడ్డులో సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఎం నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం: కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు నిత్యవసర ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, ఉద్యోగం, ఉపాధి కల్పించాలని సిపిఎం నాయకులు సిహెచ్ రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని కంచరాం గ్రామంలో సమరభేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యారావు, శ్రీనివాసరావు, ఆదియ, ప్రసాదు, గంగరాజు, తులసి, మల్లేశ్వరి, రాధా తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: ధరలు పెంపకంపై సిపిఎం పార్టీ అవలంబిస్తున్న ధరలు స్థిరీకరణ నియంత్రణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు విమర్శించారు. బుధవారం మెంటాడ ఎస్సీ కాలనీలో ధరల నియంత్రణ విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధి విధానాలు విడనాడాలని సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేగిడి నరసింహులు, ఆల్మండ్ సన్యాసిరావు, దేవుడు, మొర్చ తాత తదితరులు పాల్గొన్నారు.


రాజాం: సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

బొబ్బిలి: స్థానిక దిబ్బల, రెల్లి వీధిలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. శంకర్రావు, శాఖ కార్యదర్శి బి. యుగంధర్, గౌరీ, వెంకటరమణ జె. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ఎం.బూర్జవలస గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, నాయకులు జి.అప్పలనాయుడు, కె.శంకర, తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : మోడీ అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం పూసపాటిరేగలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రచార బేరి కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా సిపిఎం నాయకులు బి. సూర్యనారాయణ ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందివ్వాలి

ప్రజాశక్తి- బాడంగి


ఎండిఎంను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని బొబ్బిలి డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు అన్నారు. బుధవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ జరుగుతున్న తీరును పరిశీలించి ఉపాధ్యాయులు సైన్స్ కాంప్లెక్స్ ఉపయోగించుకొని వినూత్న బోధనా పద్ధతులు పాటించాలని సూచించారు. టిఎల్‌ఎమ్ సరిగా వాడాలని, విద్యార్థులు సైన్స్ విద్య పట్ల మక్కువ చూపేలా బోధన ఉండాలని, ఉపాధ్యాయులందరూ గ్రేడింగ్ ఎనాలసిస్ సరిగా పాటించి విద్యా ప్రమాణాలు మెరుగుదలకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకం అమలవుతున్న తీరును పరిశీలించి భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజు మెనూ పాటిస్తూ రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని హెచ్‌ఎం, ఎండిఎం సిబ్బందికి సూచన చేశారు. 10వ తరగతి విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి ప్రగతిని మదింపు చేయాలని పాఠ్యప్రణాలకు ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని ఎస్ఎ-1 పరీక్షలపై పూర్తిస్థాయి మదింపు గ్రేడింగ్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పిల్లలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, పాఠశాల మైదానంలో పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు దత్తి సత్యన్నారాయణ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడపగడపకు...

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రజల సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని గ్రామ సచివాలయం 3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, ఎఎంసి డైరెక్టర్ పార్వతి, పోతనపల్లి వెంకటరావు, బుగత వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు కడారి అప్పయ్య, వార్డు సభ్యులు బొబ్బిలి ఎర్రమ్మ, కొటాని ఈశ్వరి, గనివాడ శ్రీను, పాపారావు, మజ్జి శేఖర్, పాల్ కుమార్, మామిడి శంకర్ (బుజ్జి), కడారి జయశంకర్, మోపాడ కోటి, ఈశ్వర అప్పలనాయుడు, చిప్పాడ రమణ, ఎలమంచిలి అప్పారావు, నేతేటి శివ, ఒబ్బిన బంగారు నాయుడు, కొట్టాం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: ప్రజలు ఎదురుకొంటున్న సమస్యలును పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వం ఉద్దేశం అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని ముగడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామానికి తాగునీటిని అందించామన్నారు. తాగు నీటి కోసం ప్రత్యక చర్యలు తీసికోవాలని అధికారులకి తెలియజేశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే సచివాలయ సిబ్బందికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అటువంటి వారిని వాలంటీర్లు గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, తెంటు మధు, మరిపి శంకర్, జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి బోగి గౌరి, యామలి శివప్రసాద్, సచివాలయ సిబ్బంది, వావలంటీర్లు తుదితరులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథాన్ని చాటిన యువత

ప్రజాశక్తి - కొత్తవలస


వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న యువత

కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి శివారు గ్రామమైన పాత సుంకరపాలెం గ్రామ యువత ఆపదలో చిక్కుకున్న ఓ మహిళను అక్కున చేర్చుకున్నారు. విజయనగరం కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా కనపాక తారకరామ కాలనీకి చెందిన సత్యవతి గత కొద్దిరోజుల క్రితం మతిస్థిమితం కోల్పోయి పాత సుంకరపాలెం అడవిలోకి వచ్చేసింది. గత నాలుగు రోజులుగా గేదెల కాపరులకు మేకల కాపరులకు కనిపిస్తున్నప్పటికీ ఈ చుట్టుపక్కల గ్రామానికి చెందిన వారై ఉంటారని అనుకున్నారు. మంగళవారం సాయంత్రం గేదెలు కళ్ళానికి రాకపోవడంతో రైతు కుమారుడు మరొక స్నేహితునితో కలిసి గేదలు వెతకడానికి వెళ్ళగా అడవిలో దిక్కు తోచని స్థితిలో ఆ వృద్ధురాలు కనిపించడంతో విషయాన్ని గ్రామ యువతకు తెలిపారు. హుటా హుటిన రాత్రి పది గంటల సమయంలో ఆటోలు, బైకులతో 30 మంది వరకు యువకులు అడవికి చేరుకుని, ఆ వృద్ధురాలను ఊరిలోకి తీసుకువచ్చి స్నానం చేయించి, భోజనం పెట్టి వివరాలు అడగగా విజయనగరం కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా అని మిగతా వివరాలు చెప్పకపోవడంతో, విజయనగరం వన్ టౌన్ ఎస్ఐ మురళిని చరవాణిలో రాత్రి 11.30గంటల సమయంలో సంప్రదించారు. ఎంతో బాధ్యత తీసుకొని ఆ సమయంలో వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి కుటుంబ సభ్యులకు తెలియజేసి కుటుంబ సభ్యులను యువతతో మాట్లాడించి రాత్రికి ఉంచండి తెల్లవారు వచ్చి తీసుకెళ్తామని కుటుంబ సభ్యులు చెప్పగా, మళ్లీ ఎక్కడికైనా వెళ్ళిపోతుందేమోనని అనుమానంతో యువత రాత్రంతా అక్కడే ఉండి బుధవారం ఉదయం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో గ్రామస్తులందరూ యువకులను అభినందించారు. అర్ధరాత్రి సమయంలో సరైన సమాచారం అందించిన ఎస్ఐ మురళిని గ్రామస్తులందరూ అభినందించారు.

సిబ్బంది పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస, వియ్యంపేట, ఎల్.కోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పనితీరుపై డిఎంఅండ్‌హెచ్ఒ ఎస్.భాస్కరరావు బుధవారం స్థానిక పిహెచ్‌సిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు పిహెచ్‌సిల సిబ్బందిని విడివిడిగా రివ్యూ చేశారు. అందరూ సమిష్టి కృషితో, సమన్వయంతో పని చేయాలనీ తెలిపారు. పిహెచ్‌సిలో డెలివరీలు పెంచాలని, ఎన్‌సిడి సర్వే, గర్భిణులు నమోదు, హై రిస్క్ గర్భిణులను గుర్తించడం, ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. మాతా, శిశుమరణాలు జరగకుండా చూడాలన్నారు. ఫ్రైడే డ్రైడేలో నీటి నిల్వలు గుర్తించి, దోమలు వృద్ధి చెందకుండా చూసి యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేయించాలని తెలిపారు. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా, ప్రైవేట్ ఆసుపత్రిలో జ్వరాలు నమోదు కూడ పరిగణలోకి తీసుకొని చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు పై అప్రమత్తంగా ఉండి ప్రజలకి ఆరోగ్య విద్య అందించాలని తెలిపారు. మూడు పిహెచ్‌సిలో 100శాతం టార్గెట్స్ పూర్తి చేయాలని వైద్యాధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సీతల్ వర్మ, సింహాద్రి నాయుడు, సీతామహాలక్ష్మి, మురళీ కృష్ణ, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎమ్స్, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడికి సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాసరావును బుధవారం జరజాపుపేట 18వ వార్డు కౌన్సిలర్ నల్లి కృష్ణవేణి ఆధ్వర్యంలో సత్కారించారు. ఆమె మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా తమ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎంపికవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అధికార ప్రతినిధి నల్లి శ్రీను, కన్వీనర్ నల్లి శివ, నాయకులు తాలాడ సన్నిబాబు, సుంకర సన్యాసిరావు, తాలాడ గణేష్, యువకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్పు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండల కేంద్రంలో ఉన్న ఎపి మోడల్ స్కూల్ ప్రహరికి ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎట్టకేలకు బుధవారం వేరే చోటకి మార్చారు. ఎపి మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం వెనుక భాగాన చెట్లలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మండలానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు కూరాకుల సూర్యారావు చొరవతో వేరే చోటకు అమర్చారని ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్ మీడియాకు వెల్లడించారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి- డెంకాడ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అనూష

భోగాపురం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపిపి ఉప్పాడ అనూష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులతో పాటు సభ్యులపై కూడా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ముంజేరు సర్పంచ్ పూడి నూకరాజు మాట్లాడుతూ భోగాపురం జంక్షన్ నుంచి ముక్కాం వెళ్లే రహదారిలో మలుపుల వద్ద తరచు ప్రమాదాలు జరుగుతున్నందున స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు. రావాడ సర్పంచ్ పైడి నాయుడు మాట్లాడుతూ జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాలు ఇళ్లకు ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని మార్చాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని సంబంధిత అధికారులు తెలియజేశారు. ఉపాధి హామి పథకంలో లింగాలవలస, చేపలకంచేరు, చాకివలస పంచాయతీలలో పని చేసేందుకు పనులు లేనందున వారికి పక్క పంచాయతీలో పనులు కల్పించాలని ఎంపిపి సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఉపాధి హామీ పథకం ఎపిఒ ఆదిబాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దార్ చింతాడ బంగారాజు, వైస్ ఎంపిపిలు రావాడ బాబు, పడాల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో 'టిడిపి మహాశక్తి'

ప్రజాశక్తి - నెల్లిమర్ల


ప్రచారం చేస్తున్న టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు

నెల్లిమర్ల నగర పంచాయతీలో 4,5,11 వార్డుల్లో నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో బుధవారం టిడిపి మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి విజయనగరం పార్లమెంట్ మహిళ అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంటిటికి తిరిగి చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ టిడిపి అధికారంలంలోకి వచ్చిన వెంటనే 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు 1500 రూపాయలు నేరుగా అందిస్తారన్నారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో చదువుకొనే ప్రతి బిడ్డకు సంవత్సరానికి 15వేల రూపాయలు నేరుగా ఆ తల్లికే అందిస్తామన్నారు. దీపం పేరుతో ప్రతి ఇంటికి సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బైరెడ్డి లీలావతి, చిల్ల పద్మ, లెంక హైమావతి, కింతాడ కళావతి, చీకటి సుహాసిని, కోట్ల సునీత, ముడుమంచి లక్ష్మి, పొడుగు కృష్ణవేణి, చందక గౌరి, వాసు, అప్పారావు, అవనాపు సత్యనారాయణ పాల్గొన్నారు.

గొంప సేవలు మరువలేనివి

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట వద్ద గల బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో ఉన్న దట్టమైన డొంకలు, పిచ్చిమొక్కలను సుమారు రూ.లక్ష ఖర్చుపెట్టి బాగుచేయించడం గొప్ప విషయమని గురుకులాల జిల్లా సమన్వయకర్త పి.పద్మజ అన్నారు. బుధవారం ఆమె ఆ వసతి గృహాన్ని పరిశీలించారు. సొంత డబ్బు ఖర్చుపెట్టి విద్యార్థులకు ఉపసమనం కల్పించిన గొంప కృష్ణ, గొంప వెంటకరావు సేవలు మరువలేనివని కొనియాడారు. ముందుగా పది, ఇంటర్ విద్యార్థుల ప్రతిభను, గ్రంథాలయాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ఈ ఏడాది జరగనున్న పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణులు కావాలని అందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని సిబ్బందికి తెలిపారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా మన వసతి గృహానికి గొంప కృష్ణ, గొంప వెంకటరావు ఆర్థిక సాయంతో సుమారు 200 పండ్ల మొక్కలు నాలుగు ఎకరాల్లో నాటేందుకు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. మొక్కలు నాటేందుకు అవసరమైన గోతులు తీయించడం, విద్యార్థుల సమస్యలను సామాజిక కార్యకర్త, ప్రజాశక్తి విలేకరి ఆర్ అప్పారావు, పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టి సాధించడం శుభపరిణామమన్నారు. వసతి గృహాన్ని ఆనుకుని ఉన్న దట్టమైన పిచ్చిమొక్కలను తొలగించడంలో కీలక భూమిక పోషించిన అప్పారావును సత్కరించుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పాల్గొన్నారు.


అప్పారావును సత్కరిస్తున్న పద్మజ, ప్రిన్సిపల్


ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న విద్యార్థిని

'రాష్ట్రానికి రక్ష జగనన్న'

ప్రజాశక్తి- డెంకాడ

రక్షా బంధన్‌ను పురస్కరించుకుని బుధవారం 'రాష్ట్రానికి రక్ష జగనన్న' కార్యక్రమాన్ని పెద్దతాడివాడ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో పెను సంచలనాత్మక మార్పులు తీసుకొచ్చి దేశానికే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిపిలిన ఖ్యాతి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అమ్మఒడి, నాడు-నేడు వంటి సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ప్రతి పేదవాడు ఉన్నత చదువులు చదివేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, బర్రి చిన్నప్పన్న, స్థానిక సర్పంచులు, ఎంపిటిసిలు, జెసియస్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.